# కవితా కౌముది

## అగమ్య సుషుప్తి
### డేగల అనితాసూరి

స్వప్నపు కొమ్మలనుంచి
తెగిపడిన మనసు
అమాంతంగా ఊహలరెక్కలు
తొడుక్కుంది!

అంతర్జాల గవాక్షాల్లోంచి
ప్రకృతిని కృతకంగా పలకరిస్తూ
రెప్పలదుప్పటి వెనుక
వెచ్చటి వేకువల్ని చేజార్చుకుంది!

దూసుకుపోయే సమయాన్ని
నిలవని పాదాలకుచుట్టి
బంధాల బంధనాలు విడిచి
అంధకారపు ఆవలితీరాల్ని వెదుకుతుంది!

జ్ఞాపకాలదారి మరిచి
ఎడతెగని ఆశల ఎదురుచూపులతో
తనదికాని తలపులకోసం
నిరంతరం తలమునకలౌతుంది!

***

## మరణానికి ముందు
### జి.రామచంద్రరావు

మరణం ఎప్పుడూ ముగింపు కాదు.
చావు దేనికీ సమాప్తం కాదు,
నువ్వుసాధించగా మిగిలిన ఆశయం
ఇంకొకడెవడో భుజానికెత్తుకుంటాడు,
నీ సంపాదనలో మిగిలినదంతా
మరొకడెవడో ఆబగా తింటాడు,
పాడెమీద పడిపోయాక
నువ్వెంత వాడివైనా శవమనే అంటారు..!
మంటల్లో దహనమయ్యేది దేహం మాత్రమే
ప్రాణాలతో వుండగానే
ప్రతిష్టను కాపాడుకో,
ఎన్నుకున్న రంగంలో
నువ్వుచేసిన కృషి  గనక ఘనమైనదైతే
అది ఎప్పటికీ నిలిచేవుంటుంది!
నిప్పులా రగులుతూ వుంటుంది!!
జీవన క్షేత్రంలో
కొన్ని విలువల్నినాటి వుంచుకో,
ఆ పైరు పెరిగిపెద్దదై
నీ సంతానంపై చల్లని నీడ ప్రసరింపజేస్తుంది,
చిరునవ్వును నీకు చిరునామాగా మారనివ్వు.
పలకరింపులోఆత్మీయతకుస్థానమివ్వు.
మరణానికి ముందు
నీ ఆలోచన
సంపాదన మీద కాక
సమాజ హితం గురించి  సాగనిస్తే
చావు నిన్నుచంపలేక
సన్నిహితుల హృదయాల్లో చిరంజీవిని చేస్తుంది.

★★★

# నేటి వారసత్వం
## గజవెల్లి శ్రీనివాసాచారి

నీ ఊపిరి ఆగింది
నీ దేహం బూడిదయింది
నీ వారసులొచ్చారు

వారికి కావల్సింది
నీ ఆస్థికలు కాదు
నీ ఆస్తులు
నీ జ్ఞాపకాలు కాదు
నీ బ్యాంకు లాకర్లు
ఇవి చూసి ఘోషించింది నీ ఆత్మ

బతికున్నప్పుడు
నీవు నేర్పావా
మానవతా విలువలు
సంస్కారం
బంధాలు అనుబంధాల
విలువలు
రెండు చేతులతో
సంపాదించావు
కోట్లు కూడబెట్టావు

నీ అడుగుజాడల్లో
నడుస్తున్నారు నీ వారసులు
ఇది నీ వారసత్వం
ఇది నడుస్తున్న చరిత్ర
ఇది సత్యం

****

# నెత్తురు అత్తరైతే
## జినుకుల వెంకటేష్

ఒంట్లో నెత్తురు
చెమటై చిందితే
చేతిలో
చిల్లిగవ్వే చిగురిస్తది!
గా గవ్వే
బువ్వై
గొంతులజారాలే
గరిబోల్ల గాసమవ్వాలే!
గిక్కడెందుకో
గట్లయితలేదు ,
పేదోడి నెత్తురు
పెద్దోడి అత్తరు
పూల వాసనై
ఏ.సి.గదుల్లో
వసి వాడిపోతోంది..!
నీ అత్తరుకు
గత్తర రాను..
నువ్ గండ్లగలువ
నువ్ గుంజకొకు గది
గా గవ్వనాదే
గీ బువ్వనాదే.

****



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఒడలు వణికించు రోజులు గడచిపోయి
వెచ్చనౌ మారుతమ్ములు వచ్చినట్లు
చిన్న రాగమ్మునెరుగని జీవితమున
ప్రణయ గీతమ్ము కోయిల పాడినట్లు

ఆకులన్నియు రాలి మ్రోడైన చెట్లు
మరల పచ్చని శోభగా మారినట్లు
వీడి యెచటికో యరిగిన విరులవన్ని
తిరిగి వనసీమలో సభ దీర్చినట్లు

మ్రోడువలెనున్న నా గృహమ్మునకు నీవు
మరలవచ్చితివీనాడు మమత మీర
ఎండిపోయిన యెద చిగురించె నేడు
తలుపు తట్టెను నవవసంతమ్ము నేడు

ఇది నిజమొ లేక యూహయో యెరుగలేను
కలయొ మెలకువయో కూడ తెలియలేను
కాని జీవితమెల్ల యీ క్షణమునందు
మొదలు తుదయును తెలియక యొదిగిపోయె

ఎన్నడెరుగని యానందమెదకు తెలియ
ఒక్క క్షణము చాలును వేయి యుగములేల?
ఒక్కపరి నీదు సన్నిధినున్న చాలు
ఆ నిమేషమ్మె శాశ్వతమట్లు తోచు



చిత్రం:కె.రామ్మోహన్

COMMENTS